ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయ్యేదెప్పుడో?

- 2021లో మంజూరైన సమీకృత మార్కెట్ భవనం
- నాలుగేళ్లుగా నిలిచిన పనులు
- ఇబ్బందులకు గురవుతున్న పట్టణవాసులు

శాంతినగర్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నాలుగేళ్లుగా నిలిచిపోవడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో పట్టణ వాసుల సౌకర్యం కోసం ఒకే చోట అన్ని రకాల నిత్యావసరాలు లభ్యమయ్యే విధంగా సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం 2021లో రూ. 2కోట్లు నిధులు మంజూరు చేసింది. శాంతినగర్, వడ్డేపల్లి, పైపాడులోని 10 వార్డుల ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా రాజోళి రోడ్డు సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. నాలుగేళ్లయినా నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ వాసులు వాపోతున్నారు. రూ. కోట్ల ప్రజాధనం వృథా అవుతున్నా నాయకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే విక్రయాలు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నాలుగేళ్లయినా పూర్తికాకపోవడంతో రోడ్లపైనే విక్రయాలు సాగించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము, ధూళిలోనే మాంసం, కూరగాయలు తదితర నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. రాయచూర్, రాజోళి రోడ్డుకు ఇరువైపుల విక్రయాలు సాగిస్తున్నారు.


రాజోళి రోడ్డులో పునాదికే పరిమితమైన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు


రాజోళి రోడ్డులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రోడ్లపై వాహనాల మధ్య వెళ్లాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు రాక నిలిచిన పనులు

2021లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ బేస్‌మెంట్ వరకు చేసి వదిలేశారు. బిల్లు అయిన తరువాత మొదటు పెడతానని అధికారులు తెలిపారు. బిల్లులు రాక పోవడంతో అలాగే వదిలేశారు. ఈ విషయమై మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులకు సమస్య వివరించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెట్టించి పట్టణ ప్రజలకు సౌకర్యం కల్పిస్తాం.

– రాజయ్య, మున్సిపల్ కమిషనర్, వడ్డేపల్లి

దుమ్ము, ధూళిలోనే



సమీకృత మార్కెట్ లేనందున మాంసం, కూరగాయలు, తినుబండారాల విక్రయాలు రాయచూర్, రాజోళి, కోయిల్‌దిన్నె రోడ్లపైనే జరుపుతుంటారు. రోడ్లకు ఇరువైపుల అమ్మకాలు జరుపుతుండటంతో దుమ్ము, ధూళి చేరిన ఆహార పదార్థాలను కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీంతో తరచూ పట్టణవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

– రామ్మోహన్, శాంతినగర్

మార్కెట్ ప్రారంభించాలి



కూరగాయలు, ఆహార పదార్థాలు అన్ని ఒకే చోట లభిస్తే బాగుంటుంది. కిరాణ సరుకులు ఒకచోట, కూరగాయలు మరోచోట కొనుగోలు చేయాల్సి వస్తోంది. సమీకృత మార్కెట్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. రోడ్లపైనే కూరగాయాల విక్రయాలు చేస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నాం.

– స్వాతి, శాంతినగర్

క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



గట్టు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ నల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల నుంచి మొత్తం 25 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన 12 మంది విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు నిర్మల, రాములమ్మ, పీఈటీ నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి



అయిజ: ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు వీరేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు పేరుతో జరుగుతున్న దోపిడీని ఉన్నతాధికారులు అరికట్టాలన్నారు. పాఠశాలల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులు విక్రయిస్తున్నారని, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మౌలిక వసతులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, వీరేష్, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



గద్వాల: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సంధ్య ఇంటర్మీడియట్ ఫలితాల్లో 991 మార్కులు సాధించింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు. రూ.30 వేలు రూపాయలు నగదు బహుమతి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యతులో విద్యార్థి చదువుకు ఆర్థికంగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మల్దకల్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలు రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు పాటుపడటంతో పాటు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు పకడ్బందీ చర్యలు

ఆత్మకూర్: పట్టణంలో దోమల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, నిత్యం ఫాగింగ్ చేపట్టడంతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టరు ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆత్మకూర్‌లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ చికెన్‌గున్యా, డెంగ్యూ కేసులు నమోదయిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు, ఇంటి పైకప్పు, ఆవరణల్లో పాత టైర్లు, బాటిళ్లు, ట్యాంకులు, నీటి నిల్వలు ఉన్నవాటిని గుర్తించి పారబోయాలన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మల్దకల్: బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహలు నిర్మూలించడమే మనందరి ధ్యేయమని జిల్లా చైల్డ్‌లైన్ ప్రొటక్షన్ అధికారి నరసింహ అన్నారు. శుక్రవారం మండలంలోని విఠలాపురం పాఠశాలలో శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడిఈడు పిల్లలతో పనులు చేయించడం చట్టారీత్య నేరమన్నారు. బాల్య వివాహాలు చేస్తే శిక్షలు తప్పవన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సభ్యులు ప్రకాష్, ఉపాధ్యాయులు ఏకాంత్, ప్రవీణ్‌కుమార్, లక్ష్మారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

కేటీదొడ్డి: ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు


ఆయిల్‌పాం మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

మానవపాడు: ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి అక్బర్, జిల్లా డీసీసీ కార్యదర్శి సిరాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయిల్‌పాం దిగుబడికి మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. అదే విధంగా ఆయిల్ పాంలో అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్‌పాం పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ఇమ్రానా, మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్, నాయకులు ప్రకాష్‌గౌడ్, గొల్ల వెంకట్రాములు, శ్రీకాంత్‌రెడ్డి, నేతాజీ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచేలా బోధన


బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వార్డెన్ నర్సింహులు


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే విధంగా బోధన ఉండాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుర్వ వీధిలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల వివరాలు పరిశీలించారు. బడి బయటి పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మెరుగైన విద్యతో పాటు పౌష్టికరమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్‌పై వంటలు శుభపరిణామం

మండల పరిధిలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ మహిళలు నూతనంగా ఏర్పాటు చేసుకున్న గ్యాస్ స్టవ్‌ను ఎంఈఓ రవీంద్రబాబు ప్రారంభించారు. అదే విధంగా మండల పరిధిలోని మిగిలిన పాఠశాలల్లోనూ గ్యాస్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పుస్తకాలు పంపిణీ

మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వార్డెన్ నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కన్న కలలను విద్యార్థులు సాకారం చేయాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం


గట్టులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్


మానవపాడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా పొందుపర్చాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కరుణకార్, భారత్ భూషన్‌రెడ్డి, అధికారులు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

గట్టు: మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 68 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐలు రాజు, నాగిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైయినేజీలో తాగునీటి పైపులైన్

గట్టు: మండల కేంద్రంలోని కొట్లగేరిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్‌ను డ్రైయినేజీ కాలువలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పైపులైన్ లీకేజీ కారణంగా నల్లానీరు కలుషితమవుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి లీకైన పైపు స్థానంలో ఇనుప పైపు ఏర్పాటు చేయాలని కొట్లగేరి వాసులు కోరుతున్నారు.


కొట్లగేరిలో డ్రైయినేజీలో తాగునీటి పైపులైన్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం పులికల్ గ్రామానికి చెందిన మైబు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.49,500 మంజూరైనట్లు తెలిపారు.

ప్రధానోపాధ్యాయులకు మెమోలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఇద్దరు ప్రధానోపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు ఎంఈఓ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వెంకట్రామనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య, రామాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనుంజయ్‌కు మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ట్రైనింగ్ రిపోర్టు ఇవ్వకుండా, మే 20 నుంచి శాంతినగర్‌లో ట్రైనింగ్‌కు హాజరు కానందున ధనుంజయ్‌కు, వాట్సాప్ గ్రూప్‌లో పాఠశాలలో విద్యార్థులు లేరని, వేకు పాఠశాలకు డిప్యుటేషన్ చేయాలని ప్రచారం చేయడంతో విద్యాశాఖ సీసీఏ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈశ్వరయ్యకు మెమో ఇచ్చినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

నిషేధిత కవర్లు విక్రయిస్తే చర్యలు

శాంతినగర్: నిషేధిత కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కార్యాలయ సిబ్బంది అన్నారు. వడ్డేపల్లి మున్సిపల్ పరిధిలో శాంతినగర్‌లోని పలు దుకాణాల్లో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారికి రూ.1,400 ఫైన్‌లు విధించినట్లు పేర్కొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని వడ్డేపల్లి, జక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో పశువులకు పశుసంవర్ధకశాఖ శాంతినగర్ ఆధ్వర్యంలో శుక్రవారం టీకాలు వేశారు. లంపీస్కిన్, జబ్బవాపు, గొంతువాపు వ్యాధులకు సంబంధించి మొత్తం 769 ఆవులు, ఎద్దులు, 501 గేదెలకు టీకాలు వేసినట్లు డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వరప్రసాద్, బుచ్చమ్మ, శాంతి, పాలాగు, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

నేడు మెగా యోగా వేడుకలు

ధరూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా యోగా డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎం ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఈఓ అబ్దుల్ ఘని, తహసీల్దార్ నరేందర్, ఎంఈఓ రవీంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

వైద్య సేవలకు హైకోర్టులో పిటిషన్


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అలంపూర్: వంద పడకల ఆస్పత్రిలో వైద్య సేవలను అందించాలని హైకోర్టును ఆశ్రయించినట్లు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలంపూర్ చౌరస్తాలో కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రిని 20 నెలల క్రితమే ప్రారంభించినప్పటికి వైద్య సిబ్బందిని నియమించ లేదన్నారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో వైద్యులను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. హైకోర్టు సైతం స్పందించడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లడానికి ప్రజలు దూరాభారంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు పొందలేకపోతున్నారన్నారు. సమీపంలో ఉన్న కర్నూలుకు వెళ్తే ఆరోగ్యశ్రీ సేవలు అందడం లేదన్నారు. అదే విధంగా 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగిన సమయాల్లో అత్యవసర సేవలు అందించే అవకాశం లేకుండా పోతుందని వాపోయారు. ఆస్పత్రిలో వెంటనే వైద్యులను నియమించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖరశర్మ, నాగేశ్వర్‌రెడ్డి, పిడుగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలి


మాట్లాడుతున్న ఎత్తం శివ

మానవపాడు: విద్యార్థులు చిన్ననాటి నుంచి లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలతో సోదర భావంతో మెలగాలన్నారు. 2012 బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి వివరించారు. వేధింపులు గురైన వారు 100, 1098ను సంప్రదించాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రామూర్తి, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

ఎర్రవల్లి: చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మండల పరిధిలోని కోదండాపురం గ్రామానికి చెందిన ఎరుకలి పరుశరాముడు తన బొలెరో వాహనంలో (నంబర్ లేదు) చికెన్ వ్యర్థాలను మహబూబ్‌నగర్ నుంచి జింకలపల్లి శివారులోని చేపల చెరువులకు తరలిస్తుండగా జింకలపల్లి గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. వాహన యజమానితో పాటు డ్రైవర్ సింహాద్రిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


పోలీసులు అదుపులో వ్యర్థాలను తరలిస్తున్న వాహనం

శిథిల రోడ్డుతో అవస్థలు


కంకర తేలి ప్రమాదకరంగా మారిన రోడ్డు

అయిజ: గద్వాల- అయిజ రోడ్డు బింగిదొడ్డి స్టేజీ సమీపంలో శిథిలమై నానా అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. మోకాటి లోతు గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా బింగిదొడ్డి సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జికి ఇరువైపులా భారీ వాహనాలు తిరగుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై కంకర రాళ్లు తేలినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బ్రహ్మదేవుడికి ప్రత్యేక పూజలు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామస్తులు సకాలంలో వర్షాలు కురవాలంటూ శుక్రవారం బ్రహ్మదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులంతా కలిసి బ్రహ్మదేవుడికి అభిషేకాలు, పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించారు.